భజే పవనపుత్ర.. పంచముఖ తేజ

జై బజరంగ 'భళీ'

- నాలుగు ధ్వజ స్తంభాలు కలిగిన పంచముఖుడు
- ఆంధ్రాప్యారిస్ తెనాలిలోని అరుదైన దివ్యక్షేత్రం
- నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా



సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి గుడి



ఆలయం రాజగోపురం

తెనాలి: దక్షిణ భారతదేశంలోనే నాలుగు ధ్వజ స్తంభాలు కలిగిన ఏకైక దివ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది తెనాలిలోని పంచముఖ ఆంజనేయ స్వామి క్షేత్రం. రెండు వందల ఏళ్లకుపైగా విశేష చరిత్ర కలిగిన ఈ ఆలయం ఈమధ్యనే భక్తుల సహకారంతో కొత్త శోభను సంతరించుకుంది. స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఏడురోజులపాటు జరగనున్న సందర్భంగా అరుదైన ఆలయంపై 'సాక్షి' ప్రత్యేక కథనం...

దేదీప్యమానం.. దేవస్థానం

తెనాలి పట్టణ నడిబొడ్డులో ఉంటుంది షరాఫ్ బజార్. వ్యాపార వాణిజ్య కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం దేదీప్యమానంగా విరాజిల్లుతోంది. 1803లో హనుమత్ ఉపాసకులు, బ్రహ్మశ్రీ భాగవతుల అన్నయ్య ఆలయ నిర్మాణానికి రూప కల్పన చేశారు. తన నివాస స్థలమైన తెనాలిలో పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని నిర్మించాలని, ఆ ఆలయం భక్తులకు కొంగు బంగారం కావాలని ఆయన తలచారు. అందుకు తగిన ప్రాతిపదికతో శక్తివంతమైన అనేక యంత్రాలను తన ఉపాసనా బలంతో తయారు చేయించారు. ఆలయం రూపుదిద్దుకున్నా ప్రతిష్టకు ముందే ఆయన పరమపదించారు. అనంతరం ఆయన కుమారుడు సాంబ దక్షిణామూర్తి తండ్రి ఆశయాన్ని నెరవేర్చేందుకు ఎంతగానో కృషిచేశారు. ఆలయం, గర్భాలయం, అంతరాలయాలను పూర్తి చేసి విగ్రహాలను ప్రతిష్టించారు. అప్పటి నుంచి వారి వంశీయులు హనుమంతరావు, అన్నపూర్ణయ్య సిద్ధాంతి, దక్షిణామూర్తి, ఆంజనేయ శర్మ తదితరులు వంశపారంపర్య వ్యవస్థాపకులుగా కొనసాగుతుండగా ఆలయంలో ముఖ మండపాలు, సువర్చలాదేవి ఆలయ ప్రతిష్ట, హనుమత్ సీతారామ దేవాలయ ప్రతిష్ట జరిగింది. ప్రస్తుతం ఎస్.బి.శివ ఆలయానికి వ్యవస్థాపక కుటుంబ సభ్యులుగా వ్యవహరిస్తుండగా రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆలయ అనువంశిక అర్చకులుగా స్వామి సేవలో తరిస్తున్నారు. అవుతు శ్రీనివాసరెడ్డి కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



ఉత్సవ మూర్తులకు పూజలు

నిత్య కల్యాణం.. పచ్చతోరణం

నాటి నుంచి నేటి వరకు నిత్య కల్యాణం, పచ్చతోరణంగా విలసిల్లే ఈ క్షేత్రంలో పంచముఖ ఆంజనేయ స్వామి వారు భక్తాభీష్ట వరదుడై సువర్చల సమేతంగా కొలువుదీరి ఉన్నాడు. ఆలయంలో స్వామి తూర్పు ముఖము ఆంజనేయ స్వామిగా, దక్షిణ ముఖము నరసింహస్వామిగా, పశ్చిమ ముఖము గరుత్మంతునిగా, ఉత్తర ముఖము వరాహస్వామిగా, ఊర్ధ్వ ముఖము హయగ్రీవునిగా దర్శనమిస్తారు. ఇక్కడ స్వామి ప్రతి ముఖము త్రినేత్రాలు కలిగి ఉండటం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. దక్షిణ భారత దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రతి ముఖానికి ఎదురుగా నలుదిక్కులా నాలుగు ధ్వజ స్తంభాలు ఈ ఆలయంలో మనకు దర్శనమిస్తుంటాయి.

నవావతార క్షేత్రంగా ప్రసిద్ధి

పంచముఖ ఆంజనేయ స్వామి ఈ దేవస్థానం నవావతార హనుమత్ క్షేత్రంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఆలయ ఐదో ప్రాకారంలోని గర్భాలయంలో స్వామి తొమ్మిది అవతార రూపాలు మనకు దర్శనమిస్తాయి. ఏడాది పొడవునా వివిధ ఉత్సవాలతో ఆలయం కోలాహలంగా ఉంటుంది. మాఘ మాసంలో బ్రహ్మోత్సవాలు, స్వామి కల్యాణం వైభవంగా ఇక్కడ జరుగుతుంది. చైత్ర మాసంలో స్వామికి విశేష పూజలు, ఉగాది పంచాంగ శ్రవణం, అనంతరం శ్రీరామ నవమికి విశేష పూజా కార్యక్రమాలు, రాముల వారి కల్యాణం, వైశాఖ మాసంలో 11 రోజులపాటు పంచ ముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం, పంచముఖ ఆంజనేయ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో హనుమజ్జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ ఉంటారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు హనుమాన్ చాలీసా పారాయణం, హోమాలు భక్తిశ్రద్ధలతో జరుగుతాయి. శ్రావణ పౌర్ణమికి సువర్చలా అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహిస్తారు. ఆశ్వీయుజ మాసంలో దేవి నవ రాత్రులు వైభవంగా నిర్వహిస్తారు. కార్తిక పౌర్ణమి రోజున స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, మార్గశిర మాసంలో హనుమత్ వ్రతం, ధనుర్మాసంలో ముక్కోటి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుతారు. ఆయా ఉత్సవాల్లో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి సువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామిని దర్శించి తరిస్తుంటారు.

సరికొత్త శోభ



2022లో దాతల సహకారంతో ఆలయ గర్భాలయం అంతరాలయ ప్రాకారాలు, ప్రదక్షిణ, ముఖ మండపాలను జీర్ణోద్ధరణను పూర్తిచేశారు. స్వామి గర్భాలయం మినహా ఆలయంలోని ప్రదక్షిణ మండపం, ముఖ మండపాలను తొలగించి రాతి మండపాలతో నిర్మాణాలు చేయటంతో ఆలయం సరికొత్త శోభను సంతరించుకుంది.

– అవుతు శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వహణాధికారి

అభివృద్ధి పథంలో అరుదైన ఆలయం



దేశంలో అరుదైన ఆలయమైన పంచముఖ ఆంజనేయ స్వామి గుడి భక్తులు, దేవదాయశాఖ సహకారంతో అభివృద్ధి చెందుతోంది. ధ్యానమండపం, కల్యాణ మండపం ఏర్పాటయ్యాయి. ఆలయంలో నిత్య గోత్ర నామార్చన కొనసాగుతోంది. వార్షిక బ్రహ్మోత్సవాలకు సన్నాహాలు పూర్తయ్యాయి.

– రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆలయ ప్రధాన అర్చకుడు

ఫ్రైడేను డ్రైడేగా పాటించండి

తెనాలిఅర్బన్: ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని సబ్‌యూనిట్ మలేరియా అధికారి అందె బాలచంద్రమౌళి చెప్పారు. మలేరియా విభాగం, శానిటరీ సెక్రటరీల సంయుక్త ఆధ్వర్యంలో దేవీచౌక్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో శుక్రవారం దోమల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు ఉన్నచోట దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. నీటిలో దోమలు గుడ్లు పెట్టి సంతతిని పెంచుకుంటాయని తెలిపారు. ఇవి కుట్టడం వలన మలేరియా, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు జికా వైరస్ వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ అవుతు పద్మవాణి మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని తెలిపారు. శుక్రవారం రోజు ఇంటి ఆవరణలోని పాత వస్తువులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు కె.సంధ్య, బి.సాగర్, జి.చంద్రశేఖర్, మలేరియా సూపర్‌వైజర్లు బండారు నాగమల్లేశ్వర్, దీపాల శ్రీనివాసరావు, దాసరి మల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్‌లు షేక్ రషీద్, నవీద్, శ్రీనివాసరావు, కరిముల్లా, శరత్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పద్మవాణి

అక్రమ భవన నిర్మాణాలపై దాడులు

రెండు భవనాల శ్లాబ్‌లకు రంధ్రాలు పెట్టిన సిబ్బంది

తెనాలిఅర్బన్: గంగానమ్మపేటలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులూ లేకుండా అక్రమంగా నిర్మించిన రెండు భవనాల శ్లాబ్‌లకు మున్సిపల్ అధికారులు రంధ్రాలు వేయించారు. ఈ ఘటన శుక్రవారం తెనాలిలో జరిగింది. అధికారుల కథనం ప్రకారం.. గంగానమ్మపేటలో ఇద్దరు ఇంటి యజమానులు ప్రభుత్వం అనుమతి లేకుండా నాలుగో అంతస్తును నిర్మించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని అక్కడకు పంపారు. వాటిని పగలకొట్టాలని ఆదేశించడంతో శ్లాబ్‌లకు రంధ్రాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎటువంటి కట్టడాలను నిర్మించరాదని తెలిపారు. అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీవో సాంబశివరావు, పలువురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పనులనుపర్యవేక్షిస్తున్న టీపీవో సాంబశివరావు

వెట్టిచాకిరీ చేయించడం నేరం

తెనాలి: వెట్టి చాకిరీ నిర్మూలన దినం సందర్భంగా శుక్రవారం తెనాలి కిరాణా మర్చంట్ అసోసియేషన్ హాలులో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. తెనాలి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు డి.శ్రీనివాసులు ఆదేశాలతో ఈ సదస్సును ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వివేక్‌వర్ధన్ హాజరయ్యారు. వెట్టి చాకిరీ చేయించుకోవడం నేరమని చెప్పారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించటం కోసం కోసం ఈ న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నట్టు తెలిస్తే కార్మికశాఖకు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు తెలియపరచాలని సూచించారు. నిజమని నిరూపణ జరిగినట్టయితే వెట్టి చాకిరీ చేయించుకున్నవారికి మూడేళ్ల జైలుశిక్ష, రూ. 2వేల వరకు జరిమానా విధిస్తారని చెప్పారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డి.వెంకటశివప్రసాద్ వెట్టిచాకిరీ చట్టాలను వివరించారు. మండల విద్యాశాఖ అధికారి వి.జయంతి బాబు, తెనాలి బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, ప్యానల్ న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిషోర్, ఉదయశంకర్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షకుడు షేక్ మహబూబ్, వన్ టౌన్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి వివేక్‌వర్ధన్

ప్రతి మండలంలో ఉచిత వైద్య శిబిరాలు

బాపట్ల: ఉచిత వైద్య శిబిరాలు ప్రతి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని హిందూ చైతన్య వేదిక సంయోజక్ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలంలో కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలని తీర్మానం చేశారు. హిందూ చైతన్య వేదిక చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లో తీసుకుపోవాలని కోరారు. వక్కలగడ్డ ప్రసాద్, సాయిన కొండలు, కేసని శివ గుదారంకమ్మ, నిజాంపట్నం సత్యనారాయణ, అంగలకుదురు నటరాజన్ పాల్గొన్నారు.

ఉత్తమ స్వాతంత్ర్యోద్యమ డాక్యుమెంటరీగా 'వీరస్థలి తెనాలి'

9న ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శన, అవార్డు

తెనాలి: హైదరాబాద్‌కు చెందిన మోర్ట్ ఫౌండేషన్, సామిత్ మీడియా ప్రెజెంట్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్–2025లో స్వాతంత్ర్య పోరాటంలో తెనాలి చరిత్రకు సంబంధించిన అంశంపై రూపొందించిన 'వీరస్థలి తెనాలి' చిత్రం ఉత్తమ స్వాతంత్ర్యోద్యమ డాక్యుమెంటరీగా ఎన్నికైంది. ఎంపికైన చిత్రాలను కొద్దినిముషాల నిడివితో 'ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్–టాలెంట్ అవార్డ్స్–2025' పేరుతో ఈనెల 9న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో ప్రదర్శించనున్నారు.

కొలెవరం బాంబు కేసు ఇతివృత్తంతో..

స్వాతంత్ర్యయోధుడు, తెనాలి ప్రాంతానికి చెందిన చుక్కపల్లి రామయ్య సాహసంపై తీసిన దేశభక్తి చిత్రం 'వీరస్థలి తెనాలి'. జాతీయోద్యమం ఊపందుకోకముందు, గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశంలోకి అడుగు పెట్టకముందే ఇక్కడ గ్రామీణుల్లో రగులుతున్న విప్లవాగ్నిని సూచిస్తూ 1909లో సంచలనం కలిగించిన కొలెవరం బాంబు కేసు ఈ చిత్రం ఇతివృత్తం కావడం గమనార్హం.

ఇదీ చరిత్ర

అప్పట్లో బ్రిటిష్ పాలకుల రైతు వ్యతిరేక చర్యలు, పిండారీల దోపిడీలతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యతిరేకత పెల్లుబుకింది. తెనాలికి సమీపంలోని కంచర్లపాలెం, కొలెవరం గ్రామాలకు చెందిన సాహస యువకులు చుక్కపల్లి రామయ్య, లక్కరాజు బసవయ్య, గోళ్లమూడి బ్రహ్మయ్య బ్రిటిష్ వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. దేశంలో ఆరంభమైన అతివాద ఉద్యమానికి పూర్తి మద్దతును ప్రకటించారు. ఉత్తరాదికి చెందిన అతివాద నాయకులు అత్యంత రహస్యంగా కొందరు అనుచరులను ఇక్కడకు పంపి, ఈ ముగ్గురికీ బాంబుల తయారీలో శిక్షణనిప్పించారు. కొబ్బరికాయ (టెంకాయ)లో పేలుడు పదార్థాలు కూర్చి వీరు బాంబుల్ని సిద్ధం చేశారు. చెన్నైకు వెళ్తున్న వైస్రాయ్ రైలును కొలెవరం వద్ద పేల్చివేయాలని నిర్ణయించారు. ఏప్రిల్ 3న బాంబులు ఉంచారు. చెన్ను అనే మరో యువకుడు కూడా అక్కడికి సమీపంలో బాంబును పెడుతుండగా ప్రమాదవశాత్తూ అది పేలి చనిపోతాడు. అప్పట్లో ఈ కేసు తీవ్ర సంచలనం కలిగించింది. సీరియస్‌గా తీసుకున్న బ్రిటిష్ ప్రభుత్వం ఏప్రిల్ ఆరున వీరిని అరెస్ట్ చేసింది. రామయ్యకు ద్వీపాంతరవాస జీవితఖైదును, ఇతరులకు పదేళ్ల జైలు శిక్ష విధించారు. అండమాన్ జైలులో వీరు శిక్షను అనుభవించారు. ఈ కేసులో టంగుటూరి ప్రకాశం పంతులు కూడా వాదించారు.



సన్నివేశ చిత్రీకరణ దృశ్యం (ఫైల్)



నాటి మంత్రి సుచరిత చేతులమీదుగా మిరాకిల్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ధ్రువీకరణ తీసుకున్న దర్శకుడు రత్నాకర్

రికార్డ్స్‌లో చోటు

నాటి కోర్టు తీర్పు ప్రతుల ఆధారంగా మూలకథను డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు సిద్ధం చేశారు. తెనాలికి చెందిన కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో గల్లా జ్ఞానశేఖర్ నిర్మాతగా ఈ సినిమాను పూర్తిచేశారు. బాంబు రామయ్యగా దర్శి జీవన్ నటించగా, ఇతర పాత్రల్లో తెనాలి ప్రాంత ఔత్సాహిక నటీనటులు నటించారు. నాలుగేళ్ల క్రితం రూపొందించిన ఈ సినిమాకు 'ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్', 'మిరాకిల్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం లభించింది. అప్పటి హోం మంత్రి మేకతోటి సుచరిత చేతుల మీదుగా ధ్రువీకరణను అందుకున్నారు. మళ్లీ ఇప్పుడు ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ఉత్తమ స్వాతంత్ర్యోద్యమ డాక్యుమెంటరీగా అవార్డును దర్శకుడు కనపర్తి రత్నాకర్ అందుకోనున్నారు. ఇందుకు చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తంచేసింది.



'వీరస్థలి తెనాలి' పోస్టర్

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అవగాహన అవసరమని జిల్లా వైద్యశాలలోని పీపీ యూనిట్ వైద్యురాలు డాక్టర్ రమాదేవి సూచించారు. టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని ఎస్ఎస్ఎస్‌హెచ్ స్కూల్‌లో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. చిన్న పిల్లలకు ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు. క్షయ వ్యాధి సోకిన వారు కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాలని సూచించారు. 18ఏళ్లలోపు పిల్లలకు ఎక్కువగా వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయని చెప్పారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఆర్ట్ మాస్టర్ టి.వెంకట్, ఏఎన్ఎంలు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన ప్రత్యేక సదరమ్ క్యాంపు



తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరమ్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన క్యాంప్‌లో ఈఎన్‌టీ, అప్తామాలజీ, సైక్రియాటిక్ విభాగ వికలాంగులకు పరీక్షలు చేశారు. క్యాంప్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు సేవలు అందించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి దాత వితరణ



కొల్లిపర: ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి రక్తపోటు కొలమాన యంత్రం, బరువులు కొలిచే డిజిటల్ యంత్రాలను దాత ఎస్.సత్య శ్రీనివాస్ శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో అందజేసినట్లు ఎంఎల్‌ఎస్‌హెచ్‌పి బి.సుష్మిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతల సహకారంలో వైద్యసేవలకు ఇటు వంటి పరికరాలు సమకూర్చుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సేవలందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్యసిబ్బంది, ఏఎన్ఎంలతో కలసి దాతను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎస్.శ్రీనివాసరావు, జయప్రద, విజయకుమారి, భవాని, మల్లేశ్వరి, పద్మ, ఏఎన్ఎం ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

కంప్యూటర్ పరీక్షలో భాష్యం విద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: కిడ్స్ టెక్ వైజ్ సంస్థ నిర్వహించిన కంప్యూటర్ పరీక్షల్లో సుల్తానాబాద్‌లోని భాష్యం స్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ చూపి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ మణికాంత్ తెలిపారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఇటీవల ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జిగర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అమరలింగేశ్వర స్వామి ప్రతిష్ఠోత్సవం



రేపల్లె రూరల్: మండలంలోని కారుమూరు గ్రామంలో పునఃనిర్మించిన పరబ్రహ్మేశ్వరి సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. వేద పండితులు నందివెలుగు బాలాజీ గురుకులు ఆధ్వర్యంలో అమరలింగేశ్వరస్వామి, లలితా పరబ్రహ్మేశ్వరిల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అయ్యప్ప, భద్రకాళి సమేత వీరభద్రుడు, కాలభైరవస్వామి, ఆంజనేయస్వామి, యుగళ నాగేంద్రస్వామి, నంది, నవగ్రహాలు, ఆలయ శిఖరం, ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాది పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ యెడం వెంట సునీల్, వైస్‌ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, నిర్వాహకులు గుడి ఆమణికంఠం, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

నిజాంపట్నం: కొమరవోలు గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నిజాంపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో శుక్రవారం చేయూతనిచ్చారు. విరాళాలు సేకరించి నష్టపోయిన 10వ తరగతి విద్యార్థిని గుమ్మడి నాగమణి కుటుంబానికి రూ.5,106లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సేవా నిరతిని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శివన్నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు. అగ్నిప్రమాద బాధిత మూడు కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ చేయూతనిచ్చింది. బాధితులు గుమ్మడి పరిశుద్ధరావు, గుమ్మడి ధనలక్ష్మి, గుమ్మడి రాజేంద్రప్రసాద్‌లకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం చైర్మన్ కె.గౌరీశంకర్, జాయింట్ సెక్రటరీ డి.బసవరాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ కోత

కొల్లిపర: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు మండల విద్యుత్‌శాఖ ఏఈ ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ అత్తోట విద్యుత్ ఫీడర్ పరిధిలో శిరిపురం, యాదవపాలెం, అత్తోట, కుంచవరం, దంతలూరు, దావులూరు విద్యుత్ ఫీడర్ పరిధిలో జెముడుబాడుపాలెం, దావులూరు ఆయా గ్రామాలలో విద్యుత్ కోత విధిస్తున్నట్టు వివరించారు.

హైకోర్టు ఆదేశాలతో మళ్లీ సర్పంచ్‌గా మల్లెల బాధ్యతలు



కర్లపాలెం: పేరలి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా మల్లెల వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2021 ఫిబ్రవరి 9న పేరలి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో మల్లెల వెంకటేశ్వర్లు గెలుపొందారు. అయితే అతనికి 12 వార్డులో ఓటు లేదని, ఆధార్, రేషన్ కార్డుల్లో మల్లెల వెంకటేశ్వర్లు అని పేరుందని, ఓటరు జాబితాలో మల్లెల ఆదాము అని ఉంది. దీంతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో నామినేషన్ వేసి గెలుపొందాడని, ఎన్నికను రద్దు చేయాలని ప్రత్యర్థి గొర్రుముచ్చు వీరయ్య జిల్లా కోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు విచారణ జరిపిన జిల్లా ప్రధాన యమూర్తి సర్పంచ్‌గా మల్లెల వెంకటేశ్వర్లు ఎన్నిక చెల్లదని, రెండవ స్థానంలో అత్యధిక ఓట్లు సాధించిన గొర్రుముచ్చు వీరయ్యను సర్పంచ్‌గా నియమించాలని తీర్పు ఇచ్చింది. దీంతో డీఎల్‌పీవో శరత్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు 2025 జనవరి 3న వీరయ్యతో సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో వెంకటేశ్వర్లు హైకోర్టును ఆశ్రయించారు. జిల్లా కోర్టు తీర్పుపై స్టే ఇవ్వడంతో పాటు తీర్పు వెలువడే వరకు మల్లెల వెంకటేశ్వర్లునే సర్పంచ్‌గా కొనసాగించాలని పేర్కొంది. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సర్పంచ్‌గా వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించారు.



